సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా
శుక్రవారం । 12 । జనవరి । 2024



ఆ దంపతులు.. స్ఫూర్తి ప్రదాతలు

రామకృష్ణారెడ్డి, రామతులసి దంపతులు స్వామి వివేకానంద స్ఫూర్తితో వివేకానంద ఫౌండేషన్ నెలకొల్పి సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.ఆదర్శంగా నిలుస్తున్నారు. -8లో



ఎర్రచందనం దుంగలు స్వాధీనం

కారుతోపాటు రూ. 8 లక్షల విలువైన ఎర్రచందనం దుంగలను గురువారం స్వాధీనం చేసుకున్నట్లు వీలేరు ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌ఓ సుబ్బారెడ్డి తెలిపారు. -8లో

గరిష్టం/కనిష్టం
29.9 /21.6

వాతావరణం

జిల్లాలో గురువారం 20.6 - 30.7 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

రేపటి నుంచి రేణిగుంట వరకు 'డెమో'

కడప కోటిరెడ్డి సర్కిల్: నంద్యాల-కడప-నంద్యాల మధ్య నడుస్తున్న డెమో రైలు (07284/85)ను ఈనెల 13వ తేదీ నుంచి రేణిగుంట వరకు పొడిగించారని కడప రైల్వే చీఫ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టర్ ఉమర్‌బాష, సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. నంద్యాలలో ఈ రైలు ఉదయం 5.40 గంటలకు బయలుదేరి కడపకు 8.45 గంటలకు వచ్చి, మధ్యాహ్నం 12.45 గంటలకు రేణిగుంటకు చేరుతుందన్నారు. తిరిగి రేణిగుంటలో 1.45 గంటలకు బయలుదేరి కడపకు సాయంత్రం 5.00 గంటలకు చేరుకుని నంద్యాలకు రాత్రి 9.00 గంటలకు వెళుతుందన్నారు. ఈ రైలు నంద్యాల, మద్దూరు, బనగానపల్లె, కోయిలకుంట్ల, సంజామల, నొస్సం, ఉప్పలపాడు, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, కడప, ఒంటిమిట్ట, నందలూరు, రాజంపేట, ఓబులవారిపల్లె, రైల్వేకోడూరు, బాలుపల్లె స్టేషన్లలో ఆగుతుందన్నారు.

బాధ్యతల స్వీకరణ



డా. టి. లక్ష్మీప్రసాద్

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం ప్రవేశాల సంచాలకులుగా ఎర్త్‌సైన్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డా. టి. లక్ష్మీప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో విద్యార్థుల ప్రవేశాల పరంగా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. అవకాశం కల్పించిన వీసీ, రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన సంచాలకులకు పలువురు ఆచార్యులు, అధ్యాపకులు అభినందనలు తెలిపారు. ఈయనతో పాటు అసోసియేట్ డైరెక్టర్‌లుగా డా. పి. వసుగోవర్ధన్ రెడ్డి, డా. మునికుమారి, బి. రెడ్డయ్య, గణేష్‌నాయక్‌లు పనిచేయనున్నారు.

రేపు వేమన విగ్రహావిష్కరణ

కడప కల్చరల్: కడపలోని రాజీవ్‌మార్గ్‌లో శనివారం ఉదయం 11 గంటలకు వేమన విగ్రహాన్ని కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి ఆవిష్కరిస్తారని రెడ్డి సేవా సమితి కార్యదర్శి లెక్కల కొండారెడ్డి తెలిపారు. ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష ముఖ్య అతిథిగా హాజరయ్యే ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొననున్నట్లు తెలిపారు. సాయంత్రం 3.00 గంటలకు శివశివాని హైస్కూలు ప్రాంగణంలో బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఇటీవల నిర్వహించిన పలు గ్రామీణ క్రీడా పోటీల విజేతలకు సభలో బహుమతులు అందజేస్తామన్నారు. గంగిరెద్దులాట, హరిదాసుల కీర్తనల ఆలాపన, సినీ, జానపద సంగీత విభావరి నిర్వహిస్తామన్నారు.

శభాష్ ..వలంటీర్



వెంకటమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ విజయ

బద్వేలు అర్బన్: వలంటీర్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. విధినిర్వహణలో సేవాదృక్పథంతో వ్యవహరిస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు. బద్వేలు మున్సిపాలిటీలోని 2వ వార్డులో గల శీలంవారిపల్లె గ్రామానికి చెందిన నరికేవెంకటమ్మ కిడ్నీ సమస్యతో బాధపడుతోంది.ఆమెకు ఎవరూ లేకపోవడంతో అదే గ్రామానికి చెందిన సమీప బంధువైన చిన్నయ్య(ఇతను కూడా పింఛన్ లబ్ధిదారుడు) నెల్లూరులోనే ఉంటూ అక్కడి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేయిస్తున్నాడు. దీంతో సంబంధిత వార్డు వలంటీర్ మూరతోటి విజయ తన సొంత ఖర్చులతో నెల్లూరుకు చేరుకుని ఇద్దరికి పింఛన్ సొమ్మును అందజేసింది. వలంటీర్‌ను గ్రామస్తులు, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, సచివాలయ సిబ్బంది అభినందించారు.

రాయచోటిలో సౌత్ కొరియా టీమ్



కొరియా టీమ్‌కు స్వాగతం పలుకుతున్న దృశ్యం

రాయచోటి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రాయచోటి పాలిటెక్నిక్ కళాశాలను సౌత్ కొరియా టీమ్ సభ్యులు సందర్శించారు. గురువారం అన్నమయ్య జిల్లా, రాయచోటిలో పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ ఇన్సెంటర్‌ను గుడ్ నైబర్స్ ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ సౌత్ కొరియా టీమ్ సభ్యులు హన్, జమ్మిలియా, సందీప్ గుప్తలు పరిశీలించారు.వీరికి జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఏ విధంగా పనిచేస్తుంది, ఎలాంటి నైపుణ్య కార్యక్రమాలుజరుగుతున్నాయనే విషయాల గురించి వివరించారు. కార్యక్రమంలో గుడ్ నైబర్స్ మేనేజర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దయచేసి.. వేచి ఉండండి

ప్రజలు ఎక్కడికైనా వెళ్లాలంటే సురక్షిత, సుఖవంతమైన ప్రయాణాన్ని కోరుకుంటారు. ఇందుకోసం అధికశాతం మంది అన్ని సౌకర్యాలతో తక్కువ చార్జీతో సాగే రైలు ప్రయాణాన్ని కోరుకుంటారు. ముందుగానే తమ టిక్కెట్లను రిజర్వు చేసుకుంటారు. అలాంటిది దేశ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకునే సంక్రాంతి పండుగకు సొంతూర్లకు రావడానికి రైల్వేస్టేషన్‌కు వెళితే ఉన్న రైళ్లలో పెద్ద ఎత్తున వెయిటింగ్ లిస్టు...కొత్త రైళ్ల ఊసే లేకపోవడంతో తీవ్ర నిరాశకు గురవుతున్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో రోడ్డు, అధిక మొత్తం చెల్లించి విమానయానం వైపు దృష్టి సారిస్తున్నారు.



కడప స్టేషన్‌లో రైలు ఎక్కుతున్న ప్రయాణికులు

- సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రయాణికులతో రైళ్లు కిటకిట
- చాంతాడంతా వెయిటింగ్ లిస్ట్
- గతేడాది ప్రత్యేక రైళ్లను నడిపిన అధికారులు
- ఈమారు ఆ ఊసే లేని వైనం

కడప కోటిరెడ్డిసర్కిల్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సొంతూర్లకు రావాలనుకునే ప్రయాణికులకు ప్రత్యేక రైళ్లు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. రిజర్వేషన్లు చేయించుకుందామంటే దాదాపు ఒకటిన్నర నెల నుంచి వెయిటింగ్ లిస్టు కొనసాగుతోంది. మూడు నెలల కిందట రిజర్వేషన్ చేయించుకున్న వారికి మాత్రమే బెర్త్ కన్ఫర్మ్ అయింది. అయితే చాలామంది తత్కాల్ టిక్కెట్లకు ఎదురుచూస్తున్నారు.

- కడప మీదుగా రోజువారీగా 26 రైళ్లు, వారాంతాపు 32 రైళ్లు నడుస్తున్నాయి.సంక్రాంతి పండుగ నేపథ్యంలో వీటిల్లో ముందే రిజర్వేషన్లు అయిపోయాయి. వైఎస్సార్ జిల్లాకు చెందిన చాలామంది విశాఖపట్టణం, హైదరాబాద్, చెన్నై, ముంబై, బెంగళూరు, విజయవాడ, ఢిల్లీ, పూనె తదితర ప్రాంతాల్లో ఉద్యోగ రీత్యా స్థిరపడ్డారు. సంక్రాంతి పెద్ద పండుగ కావడంతో బంధువులు, మిత్రులతో సరదాగా గడిపడానికి వస్తుంటారు. అయితే రైళ్లలో రిజర్వేషన్లు లభించకపోవడంతో వారి ఇబ్బందులు వర్ణణాతీతంగా ఉన్నాయి. ప్రత్యేక రైళ్లు లేకపోవడంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. సంక్రాంతి పండుగకు గతేడాది ప్రత్యేక రైళ్లు నడిపిన దక్షిణమధ్య రైల్వే ఈ ఏడాది మొండిచేయి చూపింది. వీటిని నడిపితే రైల్వేకు ఆదాయం పెరగడంతోపాటు ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉంటుంది. ఉభయ వైఎస్సార్ జిల్లా మీదుగా కడప, ఎర్రగుంట్ల, కమలాపురం, ప్రొద్దుటూరు, రాజంపేట, నందలూరు, రైల్వేకోడూరు, జమ్మలమడుగు రైల్వేస్టేషన్లు ఉన్నాయి. ఇప్పటికైనా రైల్వేశాఖ అధికారులు దృష్టి సారించి ఈ మార్గంలో ప్రత్యేక రైళ్లు నడపాలని కోరుతున్నారు. కడప మీదుగా చెన్నై, ముంబై, ఢిల్లీ, విశాఖపట్టణం, మధురై, కరైకల్, షిర్డీ తదితరప్రాంతాలకు రైళ్లు నడుస్తున్నాయి.

100 నుంచి 150 వరకు వెయిటింగ్ లిస్ట్

పలు రైళ్లలో వెయిటింగ్ లిస్ట్ చాంతాడంత ఉంది. ఏ రైలు తీసుకున్నా 100 నుంచి 150, 150-200 వరకు వెయిటింగ్ లిస్టు ఉండడంతో ప్రయాణికులు ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది.

రైలు చార్జీల వివరాలు (రూ.లలో)

నుంచి-వరకు	జనరల్	స్లీపర్	త్రీ-టైర్	టు-టైర్	వన్‌టైర్
కడప-కాచిగూడ	180	340	880	1235	2050
కడప-ముంబయి	295	520	1365	1940	--
కడప-చెన్నై	115	220	555	760	--
కడప-విశాఖ	250	445	1195	1710	2880
కడప-ఢిల్లీ	485	820	8130	3080	5260
కడప-మధురై	210	380	1030	1470	2445
కడప-కరైకల్	195	355	960	1365	2285
కడప-షిర్డీ	235	565	1510	2180	3695



ప్రత్యేక రైళ్లు నడపాలి



సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఆర్టీసీ బస్సుల్లో చార్జీలు అధికంగా ఉండడంతో రైళ్లను ఆశ్రయించాల్సి వస్తోంది. అయితే రైళ్లలో రద్దీ కారణంగా జనరల్‌లో కింద కూర్చొని వెళ్లాల్సి వస్తోంది. ప్రతి పండుగకు అదనపురైళ్లు నడుపుతుండేవారు. ప్రస్తుతం లేకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదు. రైల్వేశాఖ ఉన్నతాధికారులు స్పందించి పండుగకు ప్రత్యేక రైళ్లు నడపాలి.
- ఉమాపతి, ప్రయాణికుడు,కడప

ఇబ్బందులు లేకుండా చూడాలి



ప్రస్తుత పరిస్థితుల్లో రైలు ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. మూడు నెలల కిందటే రిజర్వేషన్లు చేయించుకున్నవారికి మాత్రమే బెర్త్ లభిస్తోంది.వెయిటింగ్ లిస్టు అధికంగా ఉండడంతో సీటు దొరకుతుందన్న నమ్మకం లేదు. ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించి రైల్వేశాఖ అధికారులు ఆయా రూట్లలో అదనపు రైళ్లను నడిపి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి.
- షోదదాసి శ్యాముల్‌రాజ్, కడప

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం



గుంతకల్లు రైల్వే డివిజన్‌లో ప్రత్యేక రైళ్లు నడపకపోవడంతో రద్దీ పెరిగింది. ప్రత్యేక రైళ్లు నడిపి ఉంటే ప్రయాణికులకు ఇబ్బందులు తప్పేవి. ఈ విషయమై రైల్వేశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం. - వైపీ డేవిడ్, డీఆర్ యూసీసీ మెంబర్, గుంతకల్లు డివిజన్

కొత్త కార్డులకు రేషన్

కడప సెవెన్‌రోడ్స్: కొత్త రేషన్ కార్డులకు ఈ నెల నుంచి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు అందజేస్తున్నామని డీఎస్‌ఓ చాముండేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది జులై నుంచి డిసెంబరు మధ్య కాలంలో కొత్త రేషన్‌కార్డులతో పాటు కార్డు విభజన కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులందరికీ కార్డులు మంజూరు చేశామన్నారు. జిల్లాలో 4920 కార్డులు మంజూరు చేశామని, వీరంతా ఎండీయూ వాహనాల వద్ద ఈనెల సరుకులు తెచ్చుకోవాలని సూచించారు.

క్లీన్‌సిటీ అవార్డు స్వీకరణ



అవార్డు అందుకుంటున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ వరప్రసాద్, తదితరులు

పులివెందుల టౌన్: న్యూఢిల్లీలో గురువారం జరిగిన స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో పులివెందుల మున్సిపాలిటీకి వచ్చిన క్లీన్ సిటీ అవార్డును పులివెందుల మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హాఫీజ్, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్ అందుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ వరప్రసాద్‌లు మాట్లాడుతూ ఈ అవార్డు రావడానికి పులివెందుల మున్సిపాలిటీకి అడిగిన వెంటే అన్ని వసతులు కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రంలోనే పులివెందుల మున్సిపాలిటీని అందంగా తీర్చిదిద్దడానికి సీఎం వైఎస్ జగన్ ప్రత్యేకంగా నిధులు కేటాయించి అభివృద్ధి చేయడం ద్వారా, అలాగే ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయడంవల్లే ఈ అవార్డు దక్కిందన్నారు. ఇందుకు సహకరించిన ప్రజలకు కృతజ్ఞతలు, మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు అభినందనలు తెలియజేశారు.

పారిశుధ్య కార్మికుల సంక్షేమమే ధ్యేయం

డాక్టర్ పీపీ వవ



మాట్లాడుతున్న సఫాయి కర్మచారి జాతీయ కమిషన్ సభ్యుడు డాక్టర్ పీపీ వవ

కడప సెవెన్‌రోడ్స్: పారిశుధ్య కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని సఫాయి కర్మచారి జాతీయ కమిషన్ సభ్యుడు డాక్టర్ పీపీ వవ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో సఫాయి కర్మచారీల సమస్యలు పరిష్కరించేందుకు జిల్లా అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. సమాజం ఆరోగ్యకరంగా, ఆహ్లాదంగా ఉందంటే పారిశుధ్య కార్మికుల శ్రమ ఫలితమేనన్నారు. కోవిడ్ సమయంలో సమాజానికి వారు అందించిన సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. స్వచ్ఛభారత్ మిషన్ సఫలీకృతంలో వారి పాత్ర ఎంతో ఉందన్నారు. కార్మికుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకే కేంద్రం జాతీయ స్థాయిలో ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో వారి ఆర్థికాభివృద్ధికి రుణాలు కూడా ఇస్తున్నామన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ, ఆవాస్ యోజన ద్వారా గృహ పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు. ఆప్కాస్ ద్వారా విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ప్రతినెల రెండవ సోమవారం సఫాయి కార్మికుల సమస్యలను తెలుసుకునేందుకు ప్రత్యేక ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని కడప మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ తెలిపారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకు వచ్చారు. డీఆర్వో గంగాధర్‌గౌడ్, ఏఎస్పీ తుషార్‌డూడి, సాంఘిక సంక్షేమ డీడీ సరస్వతి, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలపై దృష్టి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో అన్ని రకాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. వివిధ అంశాలపై గురువారం చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ అన్ని అంశాల్లో జిల్లాను ముందు వరుసలో నిలిపేందుకు కృషి చేయాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. సచివాలయాలు, ఆర్బీకేలు, అంగన్వాడీ కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌ల భవన నిర్మాణాలపై దృష్టి సారించి పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, సీపీఓ వెంకట్రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌పై ప్రత్యేక దృష్టి

- స్టార్ హోటల్ స్థాయిలో అతిథి గృహాలు
- పర్యాటకశాఖ ఎండీ కె.కన్నబాబు

సాక్షి ఎఫెక్ట్..



కన్నబాబు (ఫైల్)

బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ నుంచి టూరిజానికి వస్తున్న ఆదాయం తగ్గిపోతున్న కారణాలను విశ్లేషించి ప్రత్యేక దృష్టి సారిస్తామని పర్యాటకశాఖ మేనేజింగ్ డైరెక్టర్ కె.కన్నబాబు అన్నారు. గురువారం 'ఆదాయానికి ప్రైవేటు'శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఆయన మాట్లాడుతూ హార్సిలీహిల్స్‌పై ప్రైవేటు అతిథిగృహాలకు సంబంధించిన విషయాలు తమ దృష్టికి వచ్చినట్టు చెప్పారు. రెవెన్యూ అతిథిగృహం పర్యాటకశాఖ లీజు ప్రాతిపదికన తీసుకునేలా ప్రతిపాదన ఉందని చెప్పారు. ఈ విషయమై సీఎంఓ అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. అవసరమైతే అన్నమయ్యజిల్లా కలెక్టర్‌తో చర్చిస్తామన్నారు. హార్సిలీహిల్స్‌పై టూరిజం ఆదాయం పెంచుకునేందుకు ఇప్పుడున్న అతిథి గృహాలను స్టార్ హోటల్ స్థాయిలో ఆధునికీకరించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. సందర్శకులకు మెరుగైన సౌకర్యాలు, వసతులను కల్పిస్తామన్నారు. పర్యాటకశాఖకు బ్యాంకు రుణం మంజూరైందని ఈ నిధులతో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. యూనిట్ నిర్వహణలో కొన్ని లోటుపాట్లు ఉన్నాయని, వాటిని సరిచేసుకుని ఆదాయం పెంచుకుంటామని తెలిపారు. హార్సిలీహిల్స్‌ను రాష్ట్రంలోనే ప్రత్యేకస్థానంలో నిలిపేలా కృషి చేస్తామన్నారు. తంబళ్లపల్లె సమీపంలోని పుణ్యక్షేత్రం మల్లయ్యకొండపై రూ.8 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు.

జగనన్న తోడుతో ఆర్థిక ప్రగతి

- కలెక్టర్ విజయరామరాజు
- జిల్లాలో 16004 మందికి రూ. 16.93 కోట్లు
- 20,105 మంది మహిళలకు రూ. 44.42 లక్షల వడ్డీ రాయితీ



లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ విజయరామరాజు తదితరులు

కడప సెవెన్‌రోడ్స్: 'జగనన్న తోడు'పథకం చిరు వ్యాపారుల ఆర్థిక ప్రగతికి బాటలు వేస్తుందని జిల్లా కలెక్టర్ విజయ్ రామరాజు అన్నారు. గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 8వ విడత జగనన్న తోడు లబ్ధి మొత్తాన్ని బటన్ నొక్కి లబ్ధి దారుల ఖాతాల్లో జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని వీసీ ద్వారా కలెక్టర్ విజయరామరాజు, ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గజ్జల వెంకటలక్ష్మి, ఉద్యానశాఖ సలహాదారు శివప్రసాద్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్, మెప్మా పీడీ సురేష్‌రెడ్డి, ఎల్‌డీఎం దుర్గాప్రసాద్ తదితరులు వీక్షించారు. వీసీ అనంతరం 'జగనన్న తోడు'పథకానికి సంబంధించి 16,004 మంది చిరు వ్యాపారులకు మంజూరైన రూ.16,93,37,000లతో పాటు.. 20,105 మంది మహిళలకు మంజూరైన రూ. 44,41,899 ల వడ్డీ రాయితీ మొత్తం మెగా చెక్కును గౌరవ అతిథులతో కలిసి కలెక్టర్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న తోడు పథకం ద్వారా పేద చిరు వ్యాపారస్తులకు ఎలాంటి వడ్డీ లేకుండా రూ.10 వేలు ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఈ రుణం సంవత్సర కాలంలో వడ్డీ లేకుండా కేవలం రూ.10 వేలు మాత్రమే తిరిగి చెల్లించేలా ప్రభుత్వం సౌలభ్యం కల్పించిందన్నారు. రుణం పూర్తయిన తరువాత మరోసారి రూ.10 వేలు తీసుకునే అవకాశం ఉందన్నారు. 'జగనన్న తోడు'పథకాన్ని లబ్ధిదారులు సక్రమంగా సద్వినియోగించుకుని తమ వ్యాపారాన్ని వృద్ధి చేసుకోవాలని కోరారు. ఇప్పటివరకు ఈ పథకం కింద 89,848 మందికి రూ.163,18,07,000 లు పంపిణీ చేశామన్నారు.

సంక్షేమ పథకాలతో లబ్ధి



నాలుగేళ్లుగా హ్యాండ్ బ్యాగుల వ్యాపారం నిర్వహిస్తున్నాను. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలన్నింటినీ మా కుటుంబం అనుభవిస్తోంది. 'జగనన్న తోడు'సాయం అందుకోవడం ద్వారా ఆర్థిక బలం చేకూరుతోంది. ప్రస్తుతం వ్యాపారం కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి అవసరం లేకుండా పోయింది. సీఎంకు కృతజ్ఞతలు. - క్రాంతి, భవానీ నగర్, కడప

మా పాలిట వరం



మహిళలకు సంబంధించిన అన్ని వస్తువులను నేను విక్రయిస్తున్నాను. జగనన్న ప్రభుత్వం వచ్చాక పెట్టుబడి కోసం బయట వడ్డీలకు రుణాలు తెచ్చుకునే కష్టాలు తప్పాయి. ఆయన ప్రవేశపెట్టిన జగనన్న తోడు పథకం మా పాలిట వరంగా మారింది. - ప్రభావతి, విశ్వనాథపురం, కడప

వ్యాపారం మరింత అభివృద్ధి



కుటుంబ పోషణ కోసం లేడీస్ కార్నర్ నిర్వహిస్తున్నాను. 'జగనన్న తోడు'పథకం ద్వారా అందే ప్రభుత్వ సాయంతో.. వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేసుకుంటున్నాను. ప్రభుత్వ సంక్షేమ పథకాలు మా లాంటివాళ్లకు ఎంతో ఉపయోగ పడుతున్నాయి. - ఆదిలక్ష్మి, సాయి నగర్, కడప

చిరు వ్యాపారులకు తోడ్పాటు



ఆర్గానిక్ పద్ధతిలో పండించిన ధాన్యాలు, సంప్రదాయ తినుబండరాల వ్యాపారం చేసుకుని జీవిస్తున్నాను. ప్రభుత్వ సాయం వల్ల బయట వడ్డీలకు రుణాలు తెచ్చుకునే కష్టాలు తప్పాయి. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన జగనన్న తోడు పథకం మాకుఎంతో తోడ్పాటు అందిస్తోంది. ఈ వ్యాపారం ద్వారా కుటుంబ ఆర్థిక అవసరాలను, ఇబ్బంది లేకుండా పిల్లలను చదివించుకుంటున్నాం.- కె.పార్వతి, శాటిలైట్ సిటీ, కడప

అధికవడ్డీ రుణాలు తప్పాయి



ఇంతకుముందు పెట్టుబడి కోసం ప్రైవేటు వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకునేవాళ్లం. రాష్ట్ర ప్రభుత్వం జగనన్న తోడు పథకాన్ని తీసుకొచ్చి వడ్డీలేని రుణం అందిస్తోంది. సులభ వాయిదాలతో సంవత్సరం పరిధిలో చెల్లించేలా వీలు కల్పించారు. ఈ పథకం మాలాంటి చిరు వ్యాపారులకు ఎంతో ఉపయుక్తంగా ఉంది. ఇందువల్ల అధిక వడ్డీలతో అప్పులు చేయాల్సిన బాధలు తప్పాయి. మా వ్యాపారాన్ని సజావుగా సాగిస్తున్నాము.
- ఎం.లక్ష్మీ దేవి, శాటిలైట్ సిటీ, కడప

నేటి నుంచి హ్యాండ్‌బాల్ పోటీలు

కడప స్పోర్ట్స్: రాజంపేటలో ఈ నెల 12, 13 తేదీల్లో రాష్ట్రస్థాయి జూనియర్ విభాగం హ్యాండ్‌బాల్ పోటీలు(లీగ్ కమ్ నాకౌట్) నిర్వహిస్తున్నట్లు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ పసుపులేటి ప్రదీప్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పసుపులేటి పవన్‌కుమార్ తెలిపారు. శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్లో ఫ్లడ్‌లైట్ల వెలుగులో జరిగే పోటీల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరచే క్రీడాకారులను 27 నుంచి 31వ తేదీ వరకు బీహార్‌లో జరిగే జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టుకు ఎంపిక చేస్తామని తెలిపారు.

సురభి నాటకోత్సవాలను విజయవంతం చేయండి



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, ఆర్డీఓ వెంకటేశులు, తదితరులు

పులివెందుల: సురభి నాటకోత్సవాలను విజయవంతం చేయాలని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం నగరవనం (రాణితోపు)లో సురభి నాటకోత్సవాలకు సంబంధించిన బ్రోచర్లను ఆర్డీఓ వెంకటేశులుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13వ తేదీ నుంచి 18 వరకు నిర్వహించే నాటకోత్సవాలను కుటుంబ సమేతంగా విచ్చేసి తిలకించాలని కోరారు. సురభి నాటకాలకు పుట్టినిల్లు అయిన పులివెందులలో నాటక ప్రదర్శనలు ఇవ్వడం ఒక ప్రత్యేకతగా చెప్పుకోవచ్చన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మాధవ కృష్ణారెడ్డి, ఫారెస్ట్ రేంజర్ గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆటలతో మానసిక వికాసం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న డీసీసీ బ్యాంకు సీఈఓ కందుల రాజేంద్రకుమార్

కడప అగ్రికల్చర్ : ఆటలు మానసిక వికాసానికి, శరీరం ఆరోగ్యంగా ఉంచుకోవడానికి ఎంతో దోహదం చేస్తాయని కడప డీసీసీ బ్యాంకు సీఈఓ కందుల రాజేంద్రకుమార్ పేర్కొన్నారు. గురువారం సహకార ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా రాయలసీమ జోన్ పరిధిలోని డీసీసీ బ్యాంకు ఉద్యోగులకు బ్యాంకు ఆవరణంలో వివిధ ఆటల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను సీఈఓతో పాటు ఓఎస్డీ గుర్రప్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటలు మానసిక ఒత్తిడిని అధిగమించడానికి సహకరిస్తాయన్నారు. మొదటి రోజు క్రికెట్ పోటీలను రిమ్స్ వద్ద ఉన్న వైఎస్ రాజారెడ్డి స్టేడియంలో నిర్వహించారు. కడప, కర్నూలు జట్టు, అనంతపురం, చిత్తూరు జట్టు తలపడ్డాయి. ఇందులో కడప జట్టుపై కర్నూలు, అనంతపురం జట్టుపై చిత్తూరు విజయం సాధించాయి.

గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : మానసిక పరిస్థితి సరిగా లేక ఓ వ్యక్తి గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం తంబళ్లపల్లె మండలంలో జరిగింది. కురబలకోట బీసీ కాలనీకి చెందిన మగ్బూల్‌బాషా కుమారుడు ఎస్.ఇస్మాయిల్(45) ట్రాక్టర్ కూలీగా పనిచేస్తున్నాడు. అతడికి భార్య ఆయేషా, ముగ్గురు సంతానం ఉన్నారు. గత కొద్దిరోజులుగా మానసికంగా కుంగుబాటుకు లోనుకావడంతో గురువారం స్వగ్రామం ఉప్పులోరిపల్లెలో ఉన్న తల్లి మెహరూన్‌బీ వద్దకు వెళ్లాడు. అక్కడే ఇంట్లోని కత్తితో గొంతు కోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు.

ఆ దంపతులు.. స్ఫూర్తి ప్రదాతలు

జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం



అనాథ శవాన్ని మోస్తున్న రామకృష్ణారెడ్డి, రామతులసి, సంస్థ సభ్యులు.(ఫైల్)

పోరుమామిళ్ల : వారు యువతకు మార్గదర్శకులు, నిర్దేశకులు. వారు నిరంతర సేవా దీపికలు. వారు అన్నార్తులకు, అభాగ్యులకు, వృద్ధులకు ఆశ్రయం కల్పించి, అన్నం పెడుతున్న సేవామూర్తులు. వారు అనాథ శవాలకు ఆత్మబంధువులు. అయినవారు కాలదన్నినప్పుడు, ఆస్తులకే వారసులం, కన్నవారికి కాదన్నప్పుడు, వృద్ధాప్యంలో పట్టెడన్నం కోసం వీధిన పడి, గూడూ, నీడ లేక అల్లాడుతూ, ఎక్కడో కాలధర్మం చేసినవారికి అన్నీ తామే అయి అంతిమ సంస్కారం చేయడం వారి కర్తవ్యంగా నిర్వహిస్తున్నారు. అందరూ యువకులే.. ఎలాంటి అదురు బెదురు లేక ఎదురెళ్లి శవాన్ని భుజానకెత్తుకుంటున్నారు. అలాంటివారు ఉన్నందువల్లే సమాజంలో ఇంకా మంచితనం, మానవత్వం, సేవా తత్పరత బతికి ఉందనే విశ్వాసం వ్యక్తమవుతోంది.

స్వామి వివేకానంద స్ఫూర్తితో వివేకానంద ఫౌండేషన్ నెలకొల్పి, ఎన్నో స్ఫూర్తిదాయక సేవలతో తనతో కలసి వచ్చే యువకులను సంస్థలో భాగస్వాములను చేర్చుకున్నాడు పాపిజెన్ని రామకష్టారెడ్డి. పోరుమామిళ్లలో పాపిజెన్ని రామకష్టారెడ్డి అంటేనే సేవకు చిరునామా. 2010 జనవరి 12న సంస్థను స్థాపించిన రామకృష్ణారెడ్డి... రామతులసిని జీవిత భాగస్వామిగా చేసుకున్నాక ఆమెను కూడా సేవాకార్యక్రమాల్లో భాగస్వామిగా చేర్చుకున్నాడు. ఓబులాపురం- నరసాపురం మధ్య సగిలేరు ఒడ్డున సేవాశ్రమం ఏర్పాటు చేసి వృద్ధులు, అనాథలకు ఆశ్రయం కల్పించాడు.

ఆలోచన అలా మొదలయింది – రామకృష్ణారెడ్డి

పోరుమామిళ్లలో డిగ్రీ చదివేటప్పుడే స్వామి వివేకానందుని గురించి తెలుసుకున్నాను. చదువుతో పాటు వివేకానంద సూక్తులు, ఆయన జీవితం గురించి యువతకు, విద్యార్థులకు ప్రచారం చేయడం మొదలు పెట్టాను. డిగ్రీ పూర్తయి రైల్వేలో ఉద్యోగం రావడంతో సేవా కార్యక్రమాలు విస్తృత పరిచాను. విద్యార్థులకు చెప్పులు, బ్యాగులు, పుస్తకాల పంపిణీ, పేదలకు అన్నదానం, అనాథలు, వృద్ధులు, భిక్షాటన చేసేవారికి చలికాలంలో దుప్పట్లు పంపిణీ ఇలా దాతల సహకారంతో అనేక కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా చేశాను.

ఆ సంఘటన కలచివేసింది..

పోరుమామిళ్ల ఆర్టీసీ బస్టాండులో ఓ సాధువు మరణించగా కసువు, చెత్త తీసుకెళ్లే పంచాయతీ వాహనంలో ఆ శవాన్ని తీసుకెళ్లడాన్ని ప్రత్యక్షంగా చూసి మనసు కకావికలమయింది. వెంటనే శవాన్ని కిందికి దింపించి సాంప్రదాయబద్ధంగా అంతిమ సంస్కారాలు నిర్వహించి, శ్మశానానికి తీసుకెళ్లి పూడ్చాము. అప్పటి నుంచి నా భార్య రామతులసి, నా మిత్రుల సహకారంతో ఈ ప్రాంతంలో ఎక్కడ అనాథ శవం ఉన్నా మరుభూమికి తీసుకెళ్లి అంత్యక్రియలు చేస్తున్నాము. మా సేవలు గుర్తించిన దాతలు కొందరు శవాన్ని తీసుకెళ్లేందుకు ఓ వాహనం, ఓ ఫ్రీజర్ బాక్స్ అందజేశారు. దీంతో మాకు చాలావరకు వెసులుబాటు లభించింది. దాతల సహకారం, ప్రోత్సాహంతో వివేకానంద సేవాశ్రమం ఏర్పాటు చేశాము అని రామకృష్ణారెడ్డి తెలిపారు.



రామతులసి(ఫైల్)



రామకృష్ణారెడ్డి(ఫైల్)

మొదట్లో భయపడ్డా : రామతులసి

నాకు శవం అంటే భయం. నా బంధువులు మరణించినా చూసేందుకు పోయేదాన్ని కాదు. వివేకానంద ఫౌండేషన్ సేవాకార్యక్రమాల్లో పాల్గొనేదాన్ని. అయితే వివేకానంద సేవాశ్రమం నిర్వహించే సమయంలో కరోనాతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఆయనకు అందరూ ఉన్నా దగ్గరకు పోయేందుకు ఎవరూ ముందుకు రాలేదు. అయినవారే శవాన్ని పట్టించుకోలేదు. ఆ పరిస్థితిలో నా భర్త రామకష్టారెడ్డి ఇచ్చిన ధైర్యంతో మేమే అంత్య క్రియలు నిర్వహించాం. అప్పటి నుంచి శవాలను మోయాలంటే భయం పోయింది. సమాజంలో ఎవరూ అనాథగా మరణించరాదు. యువతలో సేవాభావం పెరగాలి. ఒక్కొక్కరుగా ముందుకు రావాలి.

సమాజంలో మానవతా విలువలు పెంపొందించేందుకు చైతన్య సదస్సులు నిర్వహిస్తున్నామని రామకృష్ణారెడ్డి తెలిపారు. మా సేవలు విస్తరించే ప్రయత్నం చేస్తున్నాం. ఎక్కడ ఎవరు మరణించినా ఆయా గ్రామస్తులు, పోలీసులు మాకు ఫోన్ చేస్తున్నారు. వెంటనే మేము వెళ్లి శవసంస్కారం చేస్తున్నాం.

ఇలాంటి అనేక సేవాకార్యక్రమాలతో అందరికీ మార్గదర్శకులుగా, స్ఫూర్తి ప్రదాతలుగా ఉన్న వారిని ఈ జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా మరొక సారి గుర్తు చేసుకుందాం.

నవశకం

సొంతిల్లు రావడం సంతోషంగా ఉంది



నేను పులివెందుల పట్టణం పార్నపల్లె రోడ్డులో ఉన్న రాజీవ్‌కాలనీలో అద్దె ఇంట్లో నివాసముంటున్నాను. గత ప్రభుత్వాల హయాంలో అనేకమార్లు ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నా ఇల్లు మంజూరు కాలేదు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే పేదల సంక్షేమం కోసం అర్హులైన వారికి జగనన్న కాలనీల పేరుతో ఊర్లను నిర్మిస్తున్నారు. అందులో నాకు ఇల్లు రావడం చాలా సంతోషంగా ఉంది. జగన్ బాబుకు ఎంతో రుణపడి ఉంటాం.

– గౌరి, రాజీవ్ కాలనీ, పులివెందుల

జగనన్న సురక్షతో ఉచితంగా సర్టిఫికెట్లు



గతంలో ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరిగేవాళ్లం. కానీ జగనన్న ప్రభుత్వం వచ్చాక జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వలంటీర్ మా ఇంటికి వచ్చి ఆధార్‌కార్డు, రేషన్ కార్డులు తీసుకెళ్లి ఉచితంగా ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలను తయారు చేయించింది. మా గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో అధికారులు నాకు సర్టిఫికెట్లను అందజేశారు. ఆఫీసుల చుట్టూ తిరగకుండా సర్టిఫికెట్లు రావడం ఆనందంగా ఉంది.

– మందపల్లి రామయ్య, గాంధీవీధి, సిద్దవటం

అధిక చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీటీసీ మురళి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : సంక్రాంతి పండుగ నేపథ్యంలో జిల్లాలోని ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులు ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి డీటీసీ మురళి పేర్కొన్నారు. గురువారం ఊటుకూరులోని జిల్లా ఉపరవాణా శాఖ కమిషనర్ కార్యాలయంలో కడప, ప్రొద్దుటూరు ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులు హైదరాబాద్, విజయవాడ వంటి నగరాలకు ప్రయాణికులను తరలించేటప్పుడు అధిక చార్జీలను వసూలు చేయరాదన్నారు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులలో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే బస్సులను సీజ్ చేస్తామన్నారు. ఇందుకోసం ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో ఎంవీఐ విజయభాస్కర్, ఏఎంవీఐ లక్ష్మీప్రసన్న, ప్రణీత తదితరులు పాల్గొన్నారు. కాగా, జిల్లా రవాణా శాఖ కార్యాలయాన్ని వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్ సందర్శించారు.

కారు విడిభాగాలు చోరీ చేసే దొంగ అరెస్టు

– నిందితుడు పెద్దమండ్యం మండల వాసి

మదనపల్లె : కారు మెకానిక్ షెడ్‌లో పనిచేస్తూ కారులోని విలువైన విడిభాగాలను చోరీ చేసి కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో అమ్ముకుంటూ విలాసంగా జీవిస్తున్న దొంగను ముదివేడు పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ కేశప్ప వివరాలు వెల్లడించారు. తంబళ్లపల్లె నియోజకవర్గం పెద్దమండ్యం మండలం కలిచెర్ల గ్రామంలోని బండమీదవీధికి చెందిన చాంద్‌బాషా కుమారుడు హర్షద్(19) మెకానిక్‌గా పనిచేస్తుండేవాడు. ఈ క్రమంలో కారులోని విడిభాగాలైన నాజిల్స్, డీజిల్ పంప్స్, ఇంజక్టర్లు విలువైనవిగా గుర్తించాడు. ఈ స్పేర్‌పార్ట్స్ బహిరంగ మార్కెట్లో అధిక ధరకు అమ్ముడవుతాయన్న విషయం తెలుసుకుని, వాటిని చోరీచేసి విక్రయించి పెద్ద మొత్తంలో ఆదాయం గడించేవాడు. ఈ క్రమంలోఏడాది కాలంగా అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె కేంద్రంగా వివిధ ప్రాంతాల్లోని కార్లలో విలువైన విడిభాగాలను చోరీచేశాడు. దీనికి సంబంధించి ఇదివరకే రాయచోటిలో ఇతనిపై నాలుగుకేసులు నమోదై ఉన్నాయి. గురువారం కురబలకోట మండలం అంగళ్లలో తనిఖీలు నిర్వహిస్తుండగా, నిందితుడైన హర్షద్ ఏపీ-31బీహెచ్-3523 టాటా ఇండిగో కారులో విడిభాగాలను బెంగళూరుకు తరలించేందుకు అదే మార్గంలో వచ్చాడు. పోలీసులు కారును ఆపి తనిఖీ చేయగా బండారం బయటపడింది. వెంటనే నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. అతడి వద్ద నుంచి 12 కార్లలో దొంగిలించిన 12 డీజిల్ పంపులు, 48 ఇంజక్టర్లు, కారుతో సహా స్వాధీనం చేసుకున్నారు. విడి భాగాల విలువ బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.18లక్షలు ఉంటుందని, సీజ్‌చేసిన కారు విలువ రూ.2లక్షలుగా లెక్కించి నిందితుని వద్ద నుంచి రూ.20లక్షల విలువ చేసే విడిభాగాలు, కారును స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్నామని, అతడిపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. కేసు దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన సీఐ శివాంజనేయులు, ఎస్‌ఐ ముబీన్‌తాజ్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. తాలూకా సీఐ ఎన్.శేఖర్, వన్‌టౌన్ సీఐ వలీబాషు, ముదివేడు ఎస్‌ఐ మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో కారు దగ్ధం

మదనపల్లె : అగ్నిప్రమాదంలో కారు దగ్ధమైన ఘటన గురువారం మదనపల్లె పట్టణంలో జరిగింది. కావేరి హాస్పిటల్ పక్కన శేషప్ప తోటలో నివాసం ఉంటున్న ప్రసాద్ తన ఇంటిముందు మారుతి సుజుకి ఆల్టో కారును పార్క్‌చేసి ఉంచాడు. ఉదయం 9.45 గంటల సమయంలో ఉన్నట్లుండి కారులో మంటలు చెలరేగి, అగ్నిప్రమాదం జరిగింది. గమనించిన స్థానికులు వెంటనే సమాచారాన్ని స్థానిక అగ్నిమాపకశాఖ అధికారులకు తెలిపారు. అగ్నిమాపకశాఖ అధికారి శివప్ప సిబ్బందితో కలిసి వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో సుమారు రూ.20వేల నష్టం వాటిల్లగా, అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించడంతో రూ.2లక్షల విలువైన ఆస్తిని కాపాడినట్లు యజమాని ప్రసాద్ తెలిపారు. అజాగ్రత్తగా పొగతాగడం వల్లనే అగ్నిప్రమాదం జరిగినట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు.

గుర్రంకొండలో పిచ్చికుక్క వీరంగం

గుర్రంకొండ : మండల కేంద్రమైన గుర్రంకొండలో పిచ్చికుక్క వీరంగం సృష్టించింది. కనిపించిన వారిని ఇష్టానుసారం కరవడంతో ముగ్గురు గాయపడ్డారు. ఈ సంఘటన గురువారం జరిగింది. ఇరవైరోజుల వ్యవధిలోనే రెండవ సారి పిచ్చికుక్క దాడి చేయడంతో జనం బెంబేలెత్తిపోయారు. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక తాలీం వీధిలో ఇళ్ల ముందు ఆడుకొంటున్న చిన్నారులపై, స్థానికులపై పిచ్చికుక్క ఒక్కసారిగా దాడి చేసింది. దీంతో జనం భయపడి ఇళ్లలోకి పరుగులు తీశారు. పలువురు పిచ్చికుక్కను కొట్టేందుకు వెంబడించారు. అది ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతంలోకి చొరబడి ఇష్టానుసారం కనిపించిన వారిపై దాడి చేస్తూ వెళ్లింది. పిచ్చికుక్క దాడిలో గ్రామానికి చెందిన రెహాన్(04),మున్నా(06)లకు తలపై గాయమై తీవ్ర రక్తస్రావం జరిగింది. మరికొందరిని కాళ్లు, చేతులపై కూడా కరిచింది. వీరితో పాటు అదే వీధి చివరిలో గొర్రెలు మేపుకొంటున్న మరో వ్యక్తిపై దాడి చేసింది. గాయపడిన వారిలో కొంతమందిని బంధువులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. మరికొందరు తిరుపతిలోని ఆస్పత్రులకు తరలివెళ్లారు. 20 రోజుల వ్యవధిలో గుర్రంకొండ పట్టణంలో రెండవ సారి పిచ్చికుక్క దాడి చేయడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

అనుమతుల్లేని లేఅవుట్‌లలో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు



చాపాడులో అనుమతి లేని లే అవుట్‌లో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

చాపాడు : మండల కేంద్రమైన చాపాడులో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన లే అవుట్‌లలో గురువారం కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏపీఓ కృష్ణసింగ్ ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ.. చాపాడులోని పోలీసు స్టేషన్ ఎదురుగా సర్వే నంబర్. 35, 60లలో 2 ఎకరాలు, పీహెచ్‌సీ వద్ద గల సర్వే నంబర్ 105లో 2.82 ఎకరాలు, నక్కలదిన్నె రోడ్డులో సర్వే నంబర్.64-2లో 2 ఎకరాలు, పాత గ్రామ పంచాయతీ భవనం వద్ద సర్వే నంబర్.41లో 1.50 ఎకరాలలో లే అవుట్‌లు ఏర్పాటు చేసిన భూయజమానులకు ఇప్పటికే నోటీసులు ఇచ్చామన్నారు. అయినా వారి నుంచి స్పందన లేదన్నారు. దీంతో అనుమతి లేని లే అవుట్‌లలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. అనుమతులు లేని లేఅవుట్‌లలో ప్లాట్లు కొనడం, అమ్మడం చట్టరీత్యా నేరమన్నారు. ఈ కార్యక్రమంలో కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ జేపీఓ ఇందు, ప్లానింగ్ సెక్రటరీ, గ్రామ పంచాయతీ కార్యదర్శి ధనుంజయబాబు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రెట్టింపు పరిహారం

ఆర్డీఓ శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

రాజుపాళెం : వేంపల్లె - చాగలమర్రి జాతీయ రహదారి భూ సేకరణకు సంబంధించి భూములు కోల్పోతున్న రైతులకు రిజిస్టర్ విలువ కన్నా రెట్టింపు పరిహారం చెల్లిస్తామని జమ్మలమడుగు ఆర్డీఓ జి.శ్రీనివాసులు తెలిపారు. రాజుపాళెంలోని ఎంపీడీఓ సభా భవనంలో గురువారం భూములు కోల్పోతున్న రైతులతో నష్టపరిహార చెల్లింపులో అవార్డు విచారణ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ గత మూడేళ్ల కాలానికి రిజిస్టర్ విలువలో సరాసరి ధరను లెక్కలోకి తీసుకుని ఆ విలువ కన్నా రెట్టింపు పరిహారం రైతులకు అందిస్తామన్నారు. ప్రస్తుతం ఉన్న రహదారికి ఇరువైపులా భూమిని కోల్పోతున్న రైతులకు, రోడ్డుకు దూరంగా ఉన్న పొలాలకు పరిహారం విషయంలో వ్యత్యాసం ఉంటుందన్నారు. ఆయా రెవెన్యూ పొలాలను బట్టి రిజిస్ట్రేషన్ విలువ మారుతూ ఉంటుందని, అందుకు అనుగుణంగానే ఈ పరిహారం అంచనా వేస్తామన్నారు. నూతనంగా ఏర్పాటు చేయబోయే జాతీయ రహదారి 1440కి భూమి కోల్పోతున్న రైతులకు పరిహారం విషయంలో న్యాయం జరిగేలా చూస్తామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రయాణాలకు ఇబ్బంది లేకుండా జాతీయ రహదారిని నిర్మిస్తున్నట్లు ఆర్డీఓ చెప్పారు. సమావేశంలో తహసీల్దార్ ఇందిరారాణి, నేషనల్ హైవే ఏఈ సురేంద్రారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ సాయినాథరెడ్డి, మండల సర్వేయర్ గురుశేఖర్‌రెడ్డి, ఇన్‌చార్జి ఆర్‌ఐ అశోక్ కుమార్, ఆయా గ్రామాల వీఆర్‌ఓలు, భూములు కోల్పోతున్న రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు ప్రతిపక్ష పార్టీల మాయలో పడొద్దు

వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం. జాషువా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌టీయూసీ నాయకులు

కడప కార్పొరేషన్ : అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ప్రతిపక్ష పార్టీల మాయలో పడొద్దని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎం. జాషువా, జిల్లా ప్రధాన కార్యదర్శి సుదర్శన్ రాయల్ తెలిపారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ డిమాండ్ల సాధనకు ఆందోళన అవసరమేనని, ప్రభుత్వ పెద్దలను కించపరుస్తూ, ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. సమ్మెలోకి రాజకీయాలు చొప్పించి లబ్ధిదారులకు నష్టం కలిగించడం సరికాదన్నారు. 2013 నుంచి అంగన్‌వాడీలకు పదోన్నతులు లేవని, గత ప్రభుత్వం అసలు పట్టించుకోలేదన్నారు. రాష్ట్ర విభజన తర్వాత తొలిసారిగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే ప్రమోషన్లు ఇచ్చి 560 గ్రేడ్-2 సూపర్‌వైజర్ పోస్టులను భర్తీ చేసిందన్నారు. రూ. 16 కోట్ల ఖర్చుతో ఒక్కో అంగన్ వాడీ వర్కర్‌కు, హెల్పర్‌కు 6 చొప్పున యూనిఫాం చీరలు అందించారన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బండి మరియలు,శారద, మల్లీశ్వరి పాల్గొన్నారు.

ఆశాజనకంగా చామంతి సాగు

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి

ఒంటిమిట్ట(సిద్దవటం) : చామంతి సాగు ఆశాజనకంగా ఉందని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఒంటిమిట్ట మండలం చెంచుగారిపల్లిలో పి.శివరామిరెడ్డి సాగు చేసిన చామంతి పంటను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు చామంతి తోటలో అధిక దిగుబడులను సాధించామని చెప్పారన్నారు. అనంతరం టి.గురవయ్య అనే రైతు సాగుచేసిన 10 ఎకరాల దోస పంటను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల శాఖ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, మండల ఉద్యాన అధికారి పి. సింధూరి, వ్యవసాయాధికారి జి. కిరణ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణాధికారి వై. ప్రభాకర్‌రెడ్డి, గ్రామ ఉద్యాన సహాయకురాలు వి. ప్రియదర్శిని, రైతులు, కూలీలు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి రైతుకు పథకాలు అందాలి

రాజంపేట రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం అందజేసే ప్రతి పథకం అర్హులైన ప్రతి రైతుకు అందేలా చొరవ చూపాలని ఉద్యాన అధికారులను రాష్ట్ర ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి ఆదేశించారు. మండల పరిధిలోని ఊటుకూరు పంచాయతీలో ఉద్యాన తోటలను గురువారం ఆయన పరిశీలించారు. ఉద్యానశాఖ ద్వారా అమలవుతున్న వివిధ పథకాలు ఏ విధంగా ప్రజలకు చేరవేస్తున్నారో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉద్యానశాఖ ద్వారా ప్లాస్టిక్ మల్చింగ్ సబ్సిడీ పొందిన రైతులను పంటల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్‌బీకేల ద్వారా అమలయ్యే ఉద్యాన పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు పంట నమోదు చేసుకొవడంలో ఉద్యాన అధికారులు చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజంపేట వ్యవసాయ సలహా కమిటి సభ్యులు నాగేశ్వరరాజు, ఉద్యాన విస్తరణ అధికారి పూర్ణచంద్ర, సహాయకుడు చెంగల్‌రాయుడు, రైతులు చెంగల్‌రాజు, మురళీ, మృగరాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



చామంతి తోటలో రైతు కూలీలతో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యాన సలహాదారు ప్రసాద్‌రెడ్డి

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్‌తో జిల్లాలోని నిరుద్యోగ యువతకు వృత్తి విద్యా కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రీజినల్ కో ఆర్డినేటర్ సుబ్బరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సోలార్ టీవీ ఇన్‌స్టాలర్, సూర్యమిత్ర, సోషల్ మీడియా, ఎగ్జిక్యూటివ్ ఫ్రంట్ ఆఫీసు అసోసియేట్, అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్టు, ప్రొడక్షన్ మిషన్ ఆపరేటర్, రీటైల్ సేల్స్ అసోసియేట్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్, లైట్ మోటారు వెహికల్ డ్రైవర్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సుల్లో శిక్షణ ఇస్తామన్నారు. ఇతర వివరాలకు 90630 82227 నంబరులో సంప్రదించాలన్నారు.

హెల్త్ కేర్ కోర్సులో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : నిరుద్యోగులకు కీట్స్ ట్రస్టు ఆధ్వర్యంలో విజయవాడ సమీపంలోని నందిగామలో హెల్త్‌కేర్ కౌన్సిలర్ కో ఆర్డినేటర్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నట్లు అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ తెలిపారు. 19-30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. 60 రోజులపాటు శిక్షణ ఉంటుందని, శిక్షణా కాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తారన్నారు. ఇతర వివరాలకు 90004 87423 నంబరులో సంప్రదించాలన్నారు.

కారు సహా రూ. 8 లక్షల విలువైన ఎర్రచందనం స్వాధీనం

పీలేరు : కారుతోపాటు రూ. 8 లక్షల విలువైన ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌ఓ సుబ్బారెడ్డి తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు మండలంలోని పొంతలచెరువు క్రాస్ వద్ద గురువారం తెల్లవారుజామున అటవీ సిబ్బంది ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. సుండుపల్లె వైపు నుంచి వేగంగా వెళుతున్న వాహనాన్ని సిబ్బంది ఆపే ప్రయత్నం చేశారు. అయితే డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా వేగం పెంచి శివరామపురం, రేగళ్ల మీదుగా కందూరు వైపు వెళుతుండగా అటవీ సిబ్బంది తమ వాహనంలో వెంబడించారు. కందూరు వద్ద రోడ్డు పక్కన కారును ఆపి డ్రైవర్ చీకటిలో పరారయ్యాడు. వాహనాన్ని పరిశీలించగా 5 ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించారు. ఈ దాడిలో ఎఫ్ఆర్‌ఓ వెంకటరమణ, అటవీ సిబ్బంది జె.ప్రతాప్, ప్రభుతేజ, చరణ్, సుబ్రమణ్యం, మల్లికార్జున పాల్గొన్నారు.